ప్రజాశక్తి
మంగళవారం 11 మార్చి 2025 5
శ్రీ సత్యసాయి

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రయివేటుకు ఇండస్ట్రియల్ పార్కులు

◆ ఉమ్మడి జిల్లాలో గుర్తింపు

◆ పరిశ్రమల పేరుతో తీసుకున్నా.. ఏర్పాటు శూన్యం

◆ రైతుల భూములను ప్రయివేటుకు అప్పగించే కుట్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇక నుంచి ఇండస్ట్రియల్ పార్కులను ప్రయివేటుకు అప్పగించే విధంగా ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఇప్పటి వరకు ఎపిఐఐసినే నేరుగా భూముల సేకరణ మొదలుకుని మౌలిక సదుపాయల కల్పన వరకు చేస్తూ ఉండింది. ఇక నుంచి ప్రయివేటు సంస్థలకు ఈ బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏ జిల్లాలో ఎక్కడ పారిశ్రామిక పార్కులున్నాయి. అవి ఏ దశలోనున్నాయన్నది కూడా తెలియజేసింది. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు చోట్ల పరిశ్రమల పేరుతో సేకరించినవి ఉన్నాయి. ఇందులో ఎన్ని నడుస్తున్నాయన్న వివరాలను పొందుపరిచింది.

అనంతపురం జిల్లాలో..

అనంతపురం జిల్లాలో మొత్తం 16 చోట్ల ఇండస్ట్రియల్ పార్కులున్నాయి. ఇందులో రెండు చోట్ల నాన్ ఆపరేషనల్ ఉన్నాయి. సజ్జలదిన్నె పారిశ్రామిక వాడ కోసం 3.10 ఎకరాలు సేకరించారు. ఇందులో ఇప్పటి వరకు ఆపరేషన్స్ జరగలేదు. ఇక తిమ్మసముద్రం వద్ద 606 ఎకరాలు పరిశ్రమల కోసం దశబ్ధకాలం క్రితమే రైతుల నుంచి సేకరించారు. ఇప్పటి వరకు పరిశ్రమ ఏర్పాటు జరగలేదు. ఇక్కడ ఈ స్థలాన్ని ప్రయివేటుకు అప్పగించా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇవి కాకుండా గుంతకల్లులో 57.31 ఎకరాలే కేటాయిస్తే 36.35 ఎకరాల్లోనే పరిశ్రమల ఏర్పాటు చేయడం జరిగింది. ఇక గుత్తిలో 51.51 ఎకరాలు కేటాయిస్తే 35 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటు చేయడం జరిగింది. రాప్తాడు ఎంఎస్ఎంఇ పార్కులో 50.12 ఎకరాలు కేటాయిస్తే 26.45 ఎకరాల్లో ఏర్పాటై ఉన్నాయి. ఇవి కాకుండా అనంతపురం, రాప్తాడు, తాడిపత్రి ప్రాంతాల్లోనున్న పారిశ్రామికవాడల్లో ఇప్పటికే పూర్తి స్థాయి పరిశ్రమలు ఏర్పాటై ఉన్నాయి.

సత్యసాయి జిల్లాలో...

సత్యసాయి జిల్లాలో మొత్తం 33 ప్రాంతాల్లో పారిశ్రామికవాడలను గుర్తించారు. ఇక్కడ అత్యధికంగా నాన్ ఆపరేషనల్స్ వాడలే ఉండటం గమనార్హం. 18 పార్కులు ప్రారంభానికే నోచుకోకుండా ఉన్నాయి. మడకశిర, ఆర్.అనంతపురం వద్దనే 850 ఎకరాల వరకు భూములను రైతుల నుంచి 2012లో సేకరించారు. ఇప్పటి వరకు అక్కడ పరిశ్రమ ఏర్పాటు జరగలేదు. టేకులోడు వద్ద 175 ఎకరాలు, ఆమడగూరు వద్ద 400 ఎకరాలు ఇవి కాకుండా యర్రమంచి, అమ్మవారిపల్లి, కప్పలబండ, దాదలూరు తదితర ప్రాంతాల్లోనూ ఇదే రకంగా పరిశ్రమల కోసం సేకరించి కొంత వరకు ప్రారంభమై చాలా వరకు భూములు ఖాళీగానే ఉన్నాయి.

వేలాది ఎకరాలు బీడుగానే

మధ్య తరహా పారిశ్రామికవాడలే కుండా భారీ పరిశ్రమల ఏర్పాటు కోసమని కేటాయించిన వేలాది ఎకరాలు కూడా బీడుగానే ఉన్నాయి. ఇందులో లేపాక్షి నాలెడ్జి హబ్ కోసమని చిలమత్తూరు మండలంలో 8844 ఎకరాలు ప్రయివేటు సంస్థకు కేటాయించారు. ఆ సంస్థ కేటాయించిన భూములు ఇప్పటికీ బీడుగానున్న విషయం తెలిసిందే. ఇది కాకుండా రసోయి ప్రాపర్టీట్‌కు పెద్దఎత్తున భూములు కేటాయించారు. ఈ పరిశ్రమలు ఏర్పాటు జరగలేదు. ఇప్పుడు వీటన్నింటినీ ప్రయివేటు సంస్థలకు కేటాయించాలని భావిస్తోంది.

రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

కలెక్టరేట్ వద్ద ధర్నాలో రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన రైతు సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని ఎపి రైతుసంఘం నాయకులు విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర, రైతుల సమస్యలును పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, కార్యదర్శి పెనుకొండ హరి మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిన తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ బడ్జెట్లో వ్యవసాయానికి తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరం అన్నారు. ఎన్నికల ముందు రైతుకు ఇస్తామన్న ముందస్తు పెట్టుబడి, రైతు భరోసా అమలు చేయలేదన్నారు. సెజ్‌ల పేరుతో జిల్లాలో వందలాది ఎకరాలను రైతుల నుంచి లాగేసుకుంటున్నారని తెలిపారు. భూములను తీసుకుని 20 ఏళ్లు అవుతున్న ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్ప లేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని నేపథ్యంలో ఆ భూములను తిరిగి రైతులకే అప్పగించాలన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తూ జిల్లాలోని అన్ని చెరువులకు సాగునీరు అందించాలన్నారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ పేరిట సేకరిస్తున్న భూములను విడుదల చేసి సాగులో ఉన్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వెంటనే ఆపాలన్నారు. పాడి పరిశ్రమను ఆదుకోవాలని ఉద్యాన పంటలకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ టిఎస్.చేతన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనకు సిపిఐ అనుబంధం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు అడపాల వేమనారాయణ మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మారుతి, నాయకులు నాగిరెడ్డి, వెంకటప్ప, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కౌలు సంఘం అధ్యక్షుడు కదిరప్ప, చలపతి, సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, ఆయుబ్ బాషా, ఆదినారాయణ పాల్గొన్నారు.

పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

రేపు 'ఉపాధి' కూలీల మహాధర్నా

ప్రజాశక్తి-రొద్దం

ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 12వ తేదీ విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాకు కూలీలు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాసం) జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న పిలుపునిచ్చారు. వ్యకాసం నాయకులు సోమవారం మండలంలోని తురకలా పట్నం గ్రామ సమీపంలో చేపట్టిన ఉపాధి హామీ పని ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడి వారి స్థితిగతులు తెలుసు కొన్నారు. కూలీలు మాట్లాడుతూ 8 వారాలుగా పనులు చేస్తున్నామని, బిల్లులు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని, పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. నాయకులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి కూలీల సమస్యలపై సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. కూలీలకు తక్షణం పనిముట్లు ఇవ్వాలని, పనిదినాలు పెంచి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, మేట్‌లకు పారితోషికం ఇవ్వాలని, తదితర ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాకు కూలీలు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా నాయకులు నారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన కాటికాపరులు

హిందూపురం : విజయవాడలో జరుగుతున్న కాటి కాపర్ల మహా ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని కాటి కాపర్లు తరలివెళ్లారు. ధర్మవరం రైల్వే స్టేషన్ నుంచి 80 మంది బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతు తరతరాల నుండి శ్మశానంలో నిస్వార్థంతో పనిచేస్తున్నటువంటి కాటికాపర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. విజయవాడకు వెళ్లిన వారిలో రమణతో పాటు కాటి కాపర్ల సంఘం జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, జిల్లా నాయకులు యోగానంద్, బాలు, గురు, ప్రసాద్, ఈశ్వర్, రెడ్డి పల్లి రామంజి, నరసింహప్ప తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన రైతు సంఘం నాయకులు

తనకల్లు : రైతు సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడికి మండలంలోని వివిధ గ్రామాల రైతులు, కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు శివన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే రైతు సమస్యల పరిష్కారం చేయాలని లేకపోతే దశల వారి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వివి. రమణ, సిఐటియు వేమన్న, ఆదెప్ప, రామాంజులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి భవన నిర్మాణ సంఘం కార్మికులకు న్యాయం చేయాలని బాధిత కార్మికులు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను సోమవారం కలిసి విన్నవించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ కదిరి భవన కార్మిక సంఘం కార్మికులకు 2007 సంవత్సరంలో హిందూపురం రోడ్లోని కదిరి పొలం సర్వే నెంబర్ 1769.1770 1771,లో 3.02 సెంట్ల భూమిని ఇళ్లపట్టాలకు కేటాయించారని చెప్పారు. అయితే సంఘం మాజీ అధ్యక్షుడు అహ్మద్ అలీ అందులోని పట్టాలను తన వద్ద ఉంచుకొని కార్మికులను ఆ భూములకి రానీకుండా తమకు కేటాయించిన పట్టాలలో నకిలీ పట్టాలు సృష్టించి ఇతరులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీంతో ని అసలైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు. అలాగే కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన భూమిని తన పేరిట రిజిస్టర్ చేయించుకున్నాడని ఆరోపించారు. వీటన్నిటిపై విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రంలో భవన నిర్మాణ కార్మికులు రఫిక్ రమణ, బాబు నాయక్, బాబ్జాన్, కాకర్ల మల్లి, శ్రీనివాసులు, మహమ్మద్ పాల్గొన్నారు.

'గ్లకోమా' పై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కంటికి సంబందించిన వ్యాధి అయిన గ్లకోమాపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యులు కోరారు. మండలంలోని యనమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్లకోమా వ్యాధి వారోత్సవాల అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా కంటి ప్రాధాన్యతను వివరించారు. గ్లకోమా అనేది కళ్లకు సంబంధించిన వ్యాధి అని, కంటి యొక్క డ్రైనేజీ పదార్థాలు సరిగ్గా పనిచేయకపోవడం వలన కంటి లోపల పీడనం పెరిగి ఆప్టిక్ నరానికి హాని కలిగిస్తుందని చెప్పారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే శాశ్వతంగా చూపు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కంటి విజువల్ ఫీల్డ్ పరీక్షలు ద్వారా కంటి చూపును పరిశీలించి గ్లకోమాను గుర్తిస్తారన్నారు. క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డిపిఎం డాక్టర్ అనురాధ, పుట్టపర్తి పిహెచ్‌సి డాక్టర్ జోష్నా, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ అనిల్, పిహెచ్ఎన్ లలిత కుమారి, సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పిలు, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వారోత్సవాల్లో మాట్లాడుతున్న డాక్టర్లు

సాగుదారులకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

తహశీల్దార్ మారుతికి వినతి పత్రం ఇస్తున్న సమితి నాయకులు

3 నెలల క్రితం మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని కోరు తూ సోమవారం ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతికి సాగు భూముల సాధన పోరాట సమితి ఆధ్వర్యం లో వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండలానికి చెందిన దళిత, వెనుకబడిన వర్గాల ప్రజలు సుమారు 90 మంది పందిపర్తి రెవెన్యూ పొలం సర్వే నెంబర్-384లో ముళ్ల పొదలు తొలగించి చదును చేసి భూమిని సాగులోకి తీసుకొచ్చి చాలా ఏళ్లుగా పంటలు సాగు చేస్తున్నారన్నారు. పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఈ విషయంపై పలుమార్లు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదన్నారు. భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చి 3 నెలలైందని, వెంటనే సాగుదారులకు అసైన్మెంట్ పట్టా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనుమయ్య, కిష్టప్ప, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేసుతన్న ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు

విద్యార్థులకు ఆర్‌డిటి ఆధ్వర్యంలో బహుమతులు

ప్రజాశక్తి-గుడిబండ

అమరాపురం, గుడిబండ మండలాలకు చెందిన 38 మంది నిరుపేద విద్యార్థులను స్పెయిన్ దేశస్తులు దత్తత తీసుకున్నారు. వారికి సోమవారం స్థానిక ఆర్డీటీ సంస్థ ఫీల్డ్ కార్యాలయంలో ఎటిఎల్ మీనాక్షి ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టిఎల్ షర్మిల, సిఓలు మహేష్, కుళ్లాయప్ప, ఫీల్డ్ ఆఫీసర్ యోగానంద, శ్రీరాములు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పశువుల సంత వేలం వాయిదా

ప్రజాశక్తి-గుడిబండ

ఈ నెల 12వ తేదీ నిర్వహించాల్సిన గుడిబండ పశువుల సంత వేలం పాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటించి వేలంపాట నిర్వహిస్తామని, వేలంపాటదారులు గమనించాలన్నారు.

మోపురుగుండులో పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మోపురుగుండు గ్రామంలో ఆదివారం రాత్రి ఎస్ఐ రాజకుళ్లాయప్ప ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా ఎస్ఐ బాల్యవివాహాల నిర్మూ లన, సైబర్ నేరాలు, వాహన కొత్త చట్టాలు, పిఒసి ఎస్ఒ, తదితర వాటిపై అవగాహన కల్పించారు. మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట, కర్నాటక మద్యం అమ్మకం, తదితర అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. ప్రధానంగా ప్రజలు ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొని అధిగమించాలని, ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకూడదని సూచించారు. గ్రామాల్లో అందరూ కలిసిమ మెలిసి శాంతియుతంగా జీవించాలని సూచించారు. అలాగే వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుళ్లు పాతన్న, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె నిద్రలో భాగంగా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజకుళ్లాయప్ప

అంగన్వాడీల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్వాడీ ఉద్యోగులు సెంటర్లను బంద్ చేసి, సెక్టార్ మీటింగ్‌ను బహిష్కరించి సిఐటియు ఆధ్వర్యం లో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని 'చలో విజయవాడ' కార్యక్రమానికి తరలి వెళ్తుంటే పోలీసులు ఎక్కడి కక్కడ అరెస్టులు చేయడం, నిర్బంధించడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలు వైసిపి హయాంలో సమ్మె చేపట్టగా ఆ సమయంలో ప్రస్తుత సిఎం చంద్రబాబు నేను అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నీ పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారే కానీ 8 నెలలైనా పరిష్కరించలేద న్నారు. ఇకనైనా కనీస వేతనం రూ. 26 వేలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్పు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, మెనూ ఛార్జీల పెంపు, ఉచితంగా గ్యాస్ సరఫరా, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం 3 నెలలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపు, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగి అనే పదం తొలగింపు, ప్రీస్కూల్స్ బలోపేతం, పిల్లలకు స్నాక్స్, తల్లికి వందనం పథకం, ఐదేళ్ల లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్‌లో ఉండాలని జీవో ఇవ్వాలని, వేసవిలో అందరికీ సెలవులు, తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ గిరికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, రొద్దం మండల కన్వీనర్ రంజిత్‌కుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, సీనియర్ నాయకులు జయతుంబి, లక్ష్మీదేవి, సెక్టార్ లీడర్లు లక్ష్మీదేవి, పార్వతి, శాంతిబాయ్, సరస్వతి, అనూష, అలివేలమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

ప్రజాశక్తి-గుడిబండ

సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఎంజెపి కళాశాలలో ప్రిన్సిపల్ ప్రసాద్ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్వతంత్ర భారత దేశంలో మొదటి ఉపాధ్యాయురాలని, ఆమె మహిళల విద్య, సమానత్వం కోసం కోసం కృషి చేశారని కొనియాడారు. ఆమె భావాలు, ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనురాధ, ప్రమీల, లలిత, శివలింగప్ప, శ్రీనివా సులు, దుర్గా, శ్వేత, మంజుళ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ ఎంజెపి పాఠశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

మడకశిర రూరల్ : మండలంలోని జిల్లేడుగుంట ఎంపియుపి పాఠశాలలో హెచ్‌ఎం భూతన్న అధ్యక్షతన సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వారు ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలు అని, ఆమె మహిళల చైతన్యం కోసం చేసిన ప్రయత్నాలను వివరిం చారు. ఆమె భర్త జ్యోతిరావుపూలేతో కలిసి బాలికల పాఠశాల ఏర్పాటు చేసి అణగారిన వర్గాలకు విద్యనందించారని కొనియాడారు. సాంఘిక దురాచారాలు, బాల్యవివాహాలు, అంటరానితనం, మూఢ నమ్మకాలపై తిరగబడ్డ సాంఘిక విప్లవకారిణి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సుధా రాణి, కరియన్న, ఇందిరమ్మ, లలితమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

నగర పంచాయతీ కార్మికుడు నరసింహులు రైలు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో సోమవారం నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ నరసింహులు భార్యకు దహనసంస్కారా లకు, మట్టి ఖర్చులకు రూ. 15వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయ కులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లి సర్పంచికు సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి



సర్పంచి గిరిజమ్మనాగరాజురావును సన్మానిస్తున్న గ్రామస్తులు

మండలంలోని గుడిపల్లి గ్రామపంచాయతీలోని వెలగమాకులపల్లి తండా వాసులు సోమవారం సర్పంచి గిరిజమ్మ నాగరాజు రావును ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు సర్పంచి గిరిజన తండాలో కమ్యూనిటీ భవనం మరమ్మతులు చేయించడంతో పాటు భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారన్నారు. అలాగే చాలాకాలంగా అధ్వానంగా ఉన్న మురికి కాలువల నిర్మాణం చేయించారని, దీంత తండావాసులు అందరూ కలిసి సర్పంచిని సన్మానించామన్నారు. క్రమంలో శ్రీకాంత్, జగన్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, మండల టిడిపి నాయకులు

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మంత్రి సవిత ఆదేశాలతో మండల టిడిపి నాయకులు సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి మనిషి ఆరోగ్యరీత్యా ప్రతిరోజూ విధిగా వ్యాయామం చేయాల్సి ఉంటుందన్నారు. అయితే మండలంలో ఎక్కడా వ్యాయామశాల లేకపోవడంతో ఈ విషయాన్ని మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లామ న్నారు. మంత్రి ఆదేశాలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం అధికారులతో స్థలాన్ని పరిశీలించామన్నారు. వారి వెంట రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ డివి ఆంజనేయులు, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, మండల కన్వీనర్ సిద్దలింగప్ప, నాయకులు శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, కిష్టప్ప, శివశంకర్‌యాదవ్, నాగరాజుయాదవ్, మద్దిలేటి, శంకర, నటరాజాచారి, ఆనంద్, అధికారులు ఉన్నారు.

అధికారుల ఉదాసీనత అక్రమాలకు ఊతం..!

కబ్జాకు గురైన పెన్నా కుమద్వతి ప్రాజెక్టుకు చెందిన కాలువ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన ప్రభుత్వ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుని చర్యలు తీసుకోక పోవడమే ఆక్రమణదారులకు కొండంత వరంగా మారింది. దీంతో పట్టణంలోని పెన్నా కుమధ్వాతి ప్రాజెక్టుకు చెందిన కాలువ ఆక్రమణకు గురైంది. రెవెన్యూ శాఖ ఏకంగా అందులో కొంతమందికి పట్టాలను సైతం ఇవ్వడం గమనార్హం. అధికారంలో ఏ పార్టీ ఉన్నా కబ్జాదారులకు నాయకుల అండదండలు ఉంటే చాలు కాదేది కబ్జాకు అనర్హం అన్నచందంగా ప్రభుత్వ స్థలం ఏ శాఖకు చెందినదైన కబ్జాదారుల కన్ను పడితే చాలు కబ్జాకు గురి అవుతోంది. పెన్న కుమధ్వతి ప్రాజెక్టు నుంచి కొట్నూరు చెరువును కలుపుతూ కాలువ ఉంది. ఈ కాలువకు సంబంధించిన స్థలాలను ఆక్రమణదారులు కబ్జాలు చేసుకుని గృహాలు నిర్మాణం చేసుకోవడంతో పాటు వాణిజ్య భవనాలను సైతం నిర్మించుకున్నారు. దీంతోపాటు హిందూపురం పట్టణానికి మూడు వైపులా ప్రధాన చెరువులు ఉన్నాయి. కాలువ స్థలాన్ని కాకుండా చెరువులను సైతం కబ్జా చేసుకుని భవంతులను నిర్మించుకున్నారు. కొంతమంది అయితే ఏకంగా చెరువు స్థలాల్లో ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎప్పటి కప్పుడు గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు తమకేమీ పట్టదన్నట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చెరువులన్నీ పూడికతో పూడుకు పోయినప్పటికీ ఏ మాత్రం పట్టించు కోలేదు. పురపాలక శాఖ ప్రజా అవసరాల నిమిత్తం ఇరిగేషన్ కాలువలను మురుగు కాలువలుగా మార్చుకుంది. దీనిపై సైతం ఇరిగేషన్ శాఖ అధికారులు మున్సిపల్ అధికారులకు నామమాత్రపు లేఖ రాసి చేతులు దులుపుకున్నారు. దీంతో పట్టణంలో ఉన్న చెరువులన్నీ మురుగు కూపాలుగా మారిపోయాయి. ఈ శాఖ పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షించాల్సిన రెవిన్యూ శాఖ అధికారులు ఇరిగేషన్ స్థలాలకు సైతం పట్టాలను మంజూరు చేసి అక్రమణదారులకు సర్వహక్కులను కల్పించారు. దీంతో పట్టణంలో ఇరిగేషన్ స్థలం కనిపిస్తే చాలు కబ్జాదారులు వాటికి పట్టాలను సృష్టించి నిర్మాణాలు చేసుకోవడం, వాటిని విక్రయించడం పరిపాటిగా మారింది. ఇక పట్టణంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ శాఖకు ఉంది. ఈ శాఖ అయితే స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యతను పక్కనపెట్టి నీటిపారుదల శాఖకు సంబంధించిన కాలువలను మురుగు కాలువలుగా మార్చుకుని, మున్సిపల్ నిధులను అడ్డంగా దోచుకుంటోందన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఇలా మూడు శాఖల అధికారుల నిర్లక్ష్యానికి పట్టణంలో ఉన్న నీటిపారుదల శాఖ స్థలాలన్నీ కబ్జాదారుల హస్తగతమవుతున్నాయి.

ఇరిగేషన్ భూమికి పట్టాలు మంజూరు
ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు

చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశాం

పెన్నా కుమధ్వతి ప్రాజెక్ట్ నుంచి కొట్నూరు చెరువును కలుపుతూ ఉన్న కాలువను కొంతమంది కబ్జా చేసుకుని అక్రమ నిర్మాణాలను చేసుకున్నారు. 2023 జూన్ 9వ తేదీన అప్పటి తహశీల్దార్ హసీనా సుల్తానా పట్టణంలో నీటి పారుదల శాఖకు చెందిన స్థలాల్లో కబ్జాకు గురి అయిన వాటి వివరాలను ఇవ్వాలని ఇరిగేషన్ శాఖకు కోరారు. దీంతో సమగ్ర సర్వే నిర్వహించి 103 మంది తమ ఆధీనంలో ఉన్న స్థలాలను కబ్జా చేసుకున్నారని అన్ని వివరాలతో అదే సంవత్సరం జూన్ 15వ తేదీన సమగ్ర నివేదికను అందజేశాం. దీంతో పాటు మున్సిపల్ శాఖ అధికారులకు నీటి పారుదల శాఖకు సంబంధించిన కాలువలను మురుగు కాలువలుగా ఎలా మార్చారన్న విషయంలో నోటీసు ఇచ్చాం. అయితే వారు ఇప్పటి వరకు ఎటువంటి సమాధానం తమ శాఖకు ఇవ్వలేదు. తాజాగా ప్రజాశక్తిలో కథనం రావడంతో మరో సారి సైతం మున్సిపల్ కమిషనర్‌కు కాలువల దిశను మార్చుకోవాలని లేఖ రాశాం.

యోగానంద
డిఇ, నీటిపారుదల శాఖ

తమ శాఖకు సంబంధం లేదు

నీటి పారుదల శాఖకు సంబంధించిన స్థలాల విషయంలో తమ శాఖకు ఎలాంటి సంబంధం లేదు. వారి స్థలాలను వారే పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది.ప్రభుత్వ స్థలాలను మాత్రమే తమ శాఖ పరిరక్షించుకుంటుంది.

వెంకటేశు,
తహాశీల్దార్, హిందూపురం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల పరీక్షకు సెట్ నెంబర్ 2 ప్రశ్నా పత్రాలను ను ఉపయోగించారు. సోమవారం జరిగిన పరీక్షలో జనరల్ విద్యార్థులలో 6339 మంది విద్యార్థులకు గాను 6236 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఒకేషనల్ విద్యార్థులలో 1144 మంది విద్యార్థులకు గాను 1107 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనిజిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ రఘునాథరెడ్డి తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి, అర్హత గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని జాతీయ ఉపాధి హామీ ఏపీవో నాగి రెడ్డి తెలిపారు . 5 ఎకరాల వరకు భూములు ఉన్న రైతులు బ్యాంకు బుక్కు, ఆధార్ కార్డు, పాన్ కార్డ్, రైతు సర్టిఫికెట్లను దరఖాస్తు తో పాటు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

చెత్త సేకరణలో అలసత్వం తగదు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణలో అలసత్వం తగదని ఎంపీడీవో అంజనప్ప పేర్కొన్నారు. సోమవారం ధనియాని చెరువు పంచాయతీలో క్లాప్ మిత్రల ద్వారా రోజు నిర్వహించే చెత్త సేకరణను ఈవోఆర్డీ మాధవరెడ్డి పరిశీలించారు. తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను వర్మీ కంపోస్టుకు,పొడి చెత్తను ప్రతి గురువారం అమ్మకానికి పెట్టాలన్నారు. చిన్న గ్రామాల్లో ప్రతి రోజు, ఎక్కువ ఇల్లు ఉన్న గ్రామాల్లో రెండు రోజులకు ఒకసారి చెత్త సేకరణ చేయాలన్నారు. తద్వారా వచ్చే పైకాన్ని పంచాయతీ నిధులకు చలానా ద్వారా చెల్లించాలన్నారు. విధులలో అలసత్వం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

గర్భిణులకు భోజన సౌకర్యం

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక ప్రభుత్వ ఆరోగ్య వైద్యశాలలో ప్రతి నెల గర్భిణులకు ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో భోజనం సౌకర్యం ఏర్పాటు చేశారు. సోమవారం ఏపీఎం బాబ్జాన్, ఆరోగ్య వైద్యాధికారి ఆఫ్తాన్, ఆశ్రిత, మాట్లాడుతూ తలుపుల మండలంలో 40 కిలోమీటర్ల దూరం నుంచి గర్భిణులు వైద్యశాలకు వస్తున్నారని వారికి ఇబ్బంది లేకుండా స్థానికుడు సాఫ్ట్‌వేర్ మన్సూర్ వారి ఫ్రెండ్స్ భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు.

గణితంలో ఓడీసీ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎస్. దాదా పీర్ గత నెల కొత్తచెరువు వర్ధనం అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన గణిత పోటీల్లో ప్రతిభ కనపర్చాడు. అక్కడ ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో అనంతపురంలోని పంగల్ రోడ్డు వద్ద గల ఆర్డీటీ వికలాంగుల పాఠశాలలో ట్రోఫీ, సర్టిఫికెట్‌ను దాదాపీర్‌కు అందజేశారు. ఈ పాఠశాల నుంచి విజేత అయిన దాదాపీర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, గణిత ఉపాధ్యాయుడు గంగాధర్, రవిశంకర్, సునీత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని పెడబల్లి గ్రామంలోని కొన్ని నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. ఈ మేరకు ఎంపిడిఒ అంజిన్న సోమవారం గ్రామాన్ని సందర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని శ్రీరామ సాగర్ ట్యాంక్ ద్వారా అందుతున్న నీటి పైప్ లైన్ లీకేజితో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందకుండా రోగాల బారిన పడుతున్నారని గ్రహించారు. వెంటనే లీకేజీని సరిచేరి నీటి సరఫరా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీహరి శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ హిమబిందు, బోరు మెకానిక్ రాము తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

నిరసనలో పాల్గొన్న అంగన్వాడీలు, నాయకులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జెవి. రమణ, కో కన్వీనర్ టి.అయూబ్ ఖాన్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి డి. చంద్రకళ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు పోతక్క, దీన, సునీత, ఫాతిమా, చింతమ్మ, అరుణ, లక్ష్మీదేవి, గోవిందమ్మ, వేదవతి, గంగరత్న, చిట్టెమ్మ, సరస్వతి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి జిల్లాకు శాశ్వతమైన ప్రభుత్వ భవనాలు, సిబ్బందిని కేటాయించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాసన సభలో సోమవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా సత్యసాయి జిల్లా పుట్టపర్తి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ తో పాటు అన్ని ప్రభుత్వ భవనాలు శాశ్వతంగా నిర్మించాలని కోరారు. వాటికి స్థల సేకరణ చేసి ప్రభుత్వం ద్వారా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 4న 2022 నూతన జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే పుట్టపర్తిలో ప్రభుత్వ భవనాలకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. నూతన జిల్లాకు కనీసం తగినంత సిబ్బందిని కూడా కేటాయించలేదన్నారు. నూతన జిల్లాలకు స్థలాలను సేకరించి శాశ్వతమైన ప్రభుత్వ భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సభ ద్వారా సంబంధిత మంత్రిని ఎమ్మెల్యే కోరారు. పుట్టపర్తిలో కలెక్టరేట్ ఇతర భవనాలు సత్యసాయి ట్రస్ట్ భవనాలలో కొనసాగుతున్నాయనిగుర్తు చేశారు. ప్రభుత్వం త్వరగా జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ తోపాటు సుమారు 52 డిపార్ట్‌మెంట్ కార్యాలయాలను నిర్మించి వాటికి తగినంత సిబ్బందిని నియమించాలని కోరారు. నూతన జిల్లాలకు ప్రభుత్వ భవనాలు స్థల సేకరణ సిబ్బంది కొరతపై ప్రభుత్వం పరిశీలన చేస్తుందని తప్పకుండా వాటికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని సంబంధిత మంత్రి ఈసందర్భంగా హామీ ఇచ్చారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం

నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి ఐటి కమ్యూనికేషన్ శాఖ మంత్రి లోకేష్ కు పుట్టపర్తి విమానాశ్రయంలో తెలుగుదేశం నాయకులు, అధికారులు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. గన్నవరం నుండి 5 .15 నిమిషాలకు ఆయన పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. విమానం నుండి బయటకు రాగానే ఆయనకు పలువురు ఎమ్మెల్యేలు ఎంపీలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయ విశ్రాంతి భవనంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆయనకు చిత్రపటాలు బొకేలు పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, హిందూపురం ఎంపీ పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌చ పరిటాల శ్రీరామ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న, తెలుగుదేశం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం. లాయర్ రాజశేఖర్ , లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం విమానాశ్రయంలోని హాలులో నారా లోకేష్ ను కలవడానికి వచ్చిన నాయకులను కార్యకర్తలను ఆయన పలకరించారు. అనంతరం ప్రత్యేక కాన్వాయ్ లో కదిరి బయలుదేరి వెళ్లారు. లోకేష్ పర్యటన సందర్భంగా విమానాశ్రయం, పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లను డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

పుట్టపర్తి క్రైమ్ : కదిరి లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి లోకేష్ కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయానికి భారీ ఎత్తున పల్లె అభిమానులు, లోకేష్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీ సత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ లోకేష్ కు సత్యసాయి బాబా చిత్రపటాన్ని అందజేసి స్వాగతం పలికారు. రాష్ట్ర ముస్లిం, మైనారిటీ విభాగపు కార్యదర్శి మహమ్మద్ రఫీ లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగోచం అందజేసి స్వాగతం పలికారు.

పలు సమస్యలపై అట్టుడికిన కలెక్టరేట్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పలు సమస్యలపై స్థానిక కలెక్టరేట్ సోమవారం అట్టుడికింది, రైతు సంఘాలతో పాటు పలు సంఘాల నాయకులు కలెక్టరేట్ కు తరలివచ్చారు. సోమవారం వివిధ సమస్యలపై కలెక్టర్ టీఎస్ చేతన్ కు వినతి పత్రాలు సమర్పించారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయక్, రమేష్ నాయక్, రంగనాథ్ నాయక్, రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పలుచోట్ల దళితులపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని ఎం ఆర్ పి ఎస్ నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పెడపల్లిలో ఎం ఆర్ పి ఎస్ నాయకులను సచివాలయ కార్యదర్శి కులం పేరుతో దూషించారని అతనిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లోచర్ల నరసింహులు, అధికార ప్రతినిధి రంగప్ప, పేడపల్లి తిప్పయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకులు ధూపం పల్లి కేశప్ప, పైపల్లి నరసింహులు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేసిన పలు సంఘాల నాయకులు

చింత వనంలో భూకబ్జాలను అరికట్టండి

బత్తలపల్లి మండలం సంజీవపురంలో సర్వేనెంబర్ 97 లో దాదాపు 8 ఎకరాల చింతవనంలో భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని వాటిని అరికట్టాలని మాజీ సర్పంచి ముళ్లకురు సంజీవ నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో డిఆర్ఒ విజయ సారధికి వినతి పత్రం సమర్పించారు.

ఎంపీపీని అడ్డుకున్న పోలీసులు

ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ భారీ కాన్వాయ్ తో కలెక్టరేట్కు వస్తుండగా డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. తాను మండలంలో భూకబ్జాకు పాల్పడలేదని కొందరు నాయకులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపిపి ఆరోపించాడు. తనకు కొందరితో ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని కోరారు.

వెల్డింగ్ దుకాణంలో చోరీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక వాల్మీకి సర్కిల్‌లోని లక్ష్మీనరసింహ వెల్డింగ్ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగినట్లు యజమాని నరసింహులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు వెల్డింగ్ దుకాణం వెనుక భాగంలో కొంత భాగం గోడను తొలగించి అందులో నుంచి లోపలికి చొరబడి విలువైన వెల్డింగ్ మిషనరీ, రాగి వైర్లు, తదితర రూ. 70 వేల విలువ చేసే సామగ్రిని ఎత్తుకెళ్లారు. చోరీ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నరసింహులు తెలిపారు.

నాటుసారా అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి పెద్ద తండాలో ఎక్సైజ్ శాఖ అధికారలుఉనవోదయం 2.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజలలో నాటు సారా అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన పుట్టపర్తి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నాగరాజు ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కళాకారులచే నాటు సారా తాగడం వలన వచ్చే ఆరోగ్య సమస్యలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులతో పాటు సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, స్వయం సహాయక సంఘాల సభ్యులు , పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొట్నూరు చెరువు వేలంపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొట్నూరు చెరువులో చేపలు పట్టేందుకు నిర్వహించిన వేలంపాటపై విచారణ నిర్వహించాలని పలువురు బాధితులు సోమవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కొట్నూరు చెరువును టిడిపి ఒకటో వార్డ్ ఇన్‌ఛార్జి శేఖర్ ఆదాయ వనరులుగా మార్చుకున్నారని ఆరోపించారు. సాగునీటి సంఘం కమిటీ సభ్యులు, ఇతరులు ఎవరూ గ్రామస్తులు పాల్గొనకుండా, కనీసం చాటింపు కూడా లేకుండా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండి కొట్టిస్తూ ప్రజలను మభ్యపెట్టి రూ.12 లక్షల ఆదాయానికి గండి కొట్టారని వాపోయారు. దళితులను అడ్డం పెట్టుకొని కేవలం రూ.40 వేలకు వేలం వేశారని విమర్శించారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని పక్కదారి పట్టించినందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులను వాడుకుని మోసం చేసినందుకు శేఖర్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావు భారత్ పార్టీ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగరాజు, పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు మూర్తి, పరిగి మండలం అధ్యక్షులు నరసింహులు, ఉపాధ్యక్షులు కె.మూర్తి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - గాండ్లపెంట

స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు దాతలు విద్యాసామగ్రి పంపిణీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం సిద్ధారెడ్డి తెలిపారు. వాల్మీకి సేవా సంఘం స్టేట్ జాయింట్ సెక్రెటరీ, స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న భాస్కర్ రాజు పదోతరగతి విద్యార్థులకు పెన్నులు, అట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, చిన్నప్పయ్య, గంగాధర్, విశ్వనాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

చిలమత్తూరు : యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు జయచంద్రా రెడ్డి సౌజన్యంతో చిలమత్తూరు యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో చిలమత్తూరు కేజీవీబీ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు పి. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి లక్షిపతి, శ్రీనివాసులు, నంజప్ప, సురేష్ కుమార్, అలీ ముల్ల, అనిల్, కుమార్, శంకర నారాయణ. జగదీశ్, విజయకుమార్, నవీన్, ముత్యాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

విద్యార్థులకు నాణ్యమైన భోజన అందించాలని ఎంపీడీవో ఆంజనప్ప ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం మండలంలోని పెడపల్లి యూపీ పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

ప్రజాశక్తి-హిందూపురం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖ నిర్వహించిన వివిధ పోటీలలో పాల్గొని, విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి. రత్నచే బహుమతులు అందుకున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రగతి, అధ్యాపకులు, సిబ్బంది సోమవారం అభినందించారు. స్థానిక కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత సంవత్సరం కూడా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ నిర్వహించిన వివిధ పోటీలలో తమ కళాశాల విద్యార్థులే రెండు విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా ఎస్పీ నుండి బహుమతులు అందుకున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు శాఖ నిర్వహించిన పోటీలలో తమ కళాశాలలో బీకామ్, బీఎస్సీ, బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న మదీహ, వైష్ణవి, నిఖిత విజేతలై జిల్లా ఎస్పీ నుండి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకోవడం అభినందనీయమన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్న స్థానిక డిఎస్పీ మహేశ్ సహకారంతో తమ విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై, మహిళా చట్టాలపై ఇదివరకే అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. వెంకటేశులు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి ఎస్.రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములు వారికే ఇవ్వాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ కబ్జా చేసిన తమ భూములను తిరిగి తమకే ఇప్పించాలని మండల పరిధిలోని అడవి బ్రాహ్మణపల్లి తాండ గ్రామ రైతులు, మహిళలు కోరారు. ఈ మేరకు వారు సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో ముదిగుబ్బ రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములను తమ ప్రాంతానికి సంబంధంలేని వ్యక్తి తమకు తెలియకుండానే ఆయన పేరిట, ఆయన బంధువుల పేరిట రికార్డుల్లో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ ఉన్నతాధికారులు రెండు రోజులు పాటు తమ గ్రామంలో తూతూ మంత్రంగా పరిశీలన చేసి నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తహశీల్దార్ నారాయణస్వామితో వాగ్వాదానికి దిగారు.కబ్జాకు గురైన గిరిజన రైతుల భూములను రెవెన్యూ అధికారులు తిరిగి వారికి ఇప్పించకపోతే నిరంతర ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాసులు, తిప్పయ్య, గంగిరెడ్డిపల్లి నాయుడు, లింగుట్ల వెంకటరాముడు, రాధాకృష్ణ, ముత్తులూరి మధు, అమిలినేని రామంజి, కొండయ్య , బావయ్య తదితరులు పాల్గొన్నారు

ధ్వజారోహణం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు శాస్త్రోత్తముగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వెండి దండి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.